పుష్కరం దాటినా.. అతిథి బోధనే..!



అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల

- కానరాని శాశ్వత అధ్యాపకులు
- ఇద్దరు ఒప్పంద అధ్యాపకులు
- 12 మంది గెస్ట్ ఫ్యాకల్టీ
- అగనంపూడి కళాశాలలో ప్రిన్సిపాల్ ఒక్కరే రెగ్యులర్
- డిప్యుటేషన్‌పై బోధనేతర సిబ్బంది

అగనంపూడి: అగనంపూడిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి పుష్కరకాలం కావస్తున్నా ఇంకా బాలారిష్టాలు వీడడం లేదు. వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. బోధనకు అవసరమైన అధ్యాపకుల నియామకం జరగలేదు. నేటికీ ఒప్పంద అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీతో తరగతులు నిర్వహిస్తుండడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు. కళాశాల ఏర్పాటు నుంచి ప్రిన్సిపాల్ తప్పా మిగిలిన 14 ఖాళీలు కూడా ఒప్పంద అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీతో నెట్టుకొస్తున్నారు. దీంతో విద్యాప్రమాణాలపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

అందుబాటులో ఉన్న గ్రూపులు

కళాశాలలో ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తోపాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఈఈటీ ఒకేషనల్ గ్రూపులు ఉన్నాయి. మొదటి సంవత్సరం 235 మంది, ద్వితీయ సంవత్సరం 156 మంది కలిపి మొత్తం 394 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెగ్యులర్ పోస్టుల నియామకం జరగకపోవడంతో ఒప్పంద అధ్యాపకులు, గెస్ట్ లెక్చరర్లను ఏటా నియమిస్తూ వస్తున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీతోనే..

జనరల్ గ్రూపులకు 9 మంది అధ్యాపకులు అవసరం. వీరిలో ఒకరు కాంట్రాక్ట్ పద్ధతిలో మరో 8 మంది గెస్ట్ ఫ్యాకల్టీని నియమించారు. ఒకేషనల్ గ్రూపులకు ఐదుగురు అవసరం. వీరిలో ఒకరు ఒప్పంద అధ్యాపకుడు కాగా మరో నలుగురు కూడా గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. 14 మంది అధ్యాపకులు కూడా కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీనే ఉన్నారు. ప్రిన్సిపాల్ మాత్రం రెగ్యులర్ పోస్టులో జి.సుధాకర్ బాబును నియమించారు.

సిబ్బంది కూడా డిప్యుటేషన్ పైనే..

ఇక్కడ పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది కూడా వేరే కళాశాలల నుంచి డెప్యుటేషన్‌పై వచ్చిన వారే. ఇంటర్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో గుర్తింపు తీసుకువస్తున్నా కళాశాలపై నిర్వహణపై అధికారులు శీతకన్ను వేస్తున్నారు. పూర్తిస్థాయి అధ్యాపకులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధ్యాపకులను నియమించాలి



రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలి. ఒప్పంద అధ్యాపకులు, గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలు విద్యా సంవత్సరం ఆరంభంలో చేపట్టడం లేదు. దీంతో తరగతుల నిర్వహణపై ప్రభావం పడుతోంది. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు.

– ఎస్.లావణ్య, ఇంటర్ విద్యార్థి

బాధ్యత రెట్టింపు



రెగ్యులర్ పోస్టుల్లో నియమిస్తే మరింత బాధ్యత అధ్యాపకులు పనిచేస్తారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడడానికి దోహదపడుతుందని. క్వాలిఫైడ్ అధ్యాపకులు బోధన వల్ల విద్యార్థుల సామర్థ్యం పెరుగుతుంది. గుణాత్మక విద్యను అందించే అవకాశం ఏర్పడుతుంది.

– పి.కార్తీక్, ఇంటర్ విద్యార్థి

రెగ్యులర్ అధ్యాపకులు అవసరం



విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. దీంతో పని భారం మరింత ఎక్కువ అవుతోంది. రెగ్యులర్ అధ్యాపకులు ఉంటే బాధ్యతలను విభజించుకొని విద్యార్థులపై మరింత దృష్టి పెట్టేందుకు వీలుంటుంది. బోధనేతర సిబ్బందిని అందర్నీ నియమించాలి. అవకాశం ఉన్నంత వరకు మరింత మంది రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే కళాశాలలో మరింత ఉత్తమ ఫలితాలు సాధించడానికి వీలుంటుంది.

– జి.సుధాకర్‌బాబు, ప్రిన్సిపాల్, అగనంపూడి కళాశాల

దేశం గర్వించదగ్గ ఇంజినీర్ మోక్షగుండం



సీనియర్ పారిశ్రామిక వేత్తలను సన్మానిస్తున్న ఐలా, వాసీవా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు

అక్కిరెడ్డిపాలెం: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజినీర్ అని ఆటోనగర్ ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), ప్రధానకార్యదర్శి చీకటి సత్యనారాయణ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఇంజినీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు.

ఐలా, వాసీవా ప్రతినిధులతో పాటు పారిశ్రామిక వేత్తలు మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం ఐలా కార్యాలయంలో సీనియర్ పారిశ్రామిక వేత్తలైన వై.సాంబశివరావు, సత్యనారాయణ, ఎస్.అప్పారావు, కాంట్రాక్టర్ ఎస్.నాగేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, సంయుక్త కార్యదర్శి రామకృష్ణం రాజు, మాజీ చైర్మన్ శేషగిరిరావు, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కోశాధికారి పర్వారి ప్రభాకర్, లఘు ఉద్యోగభారతి జిల్లా అధ్యక్షుడు అట్లూరి రమేష్, ఉపాధ్యక్షుడు సత్యబాబు, వాసీవా మాజీ ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్,ఐలా సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాలకు సిద్ధమవుతున్న త్రిశక్తి దేవాలయం

ఉక్కునగరం: శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి వెలసిన ఉక్కునగరంలోని త్రిశక్తి దేవాలయంలో అక్టోబర్ 3 నుంచి దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. 12 వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 4 న సహస్ర సంపెంగ పుష్పార్చన, 5న సహస్ర హస్త కంకణార్చన, 6న సహస్ర హరిద ఖండార్చన నిర్వహించనున్నారు. 7న సహస్ర కమల పుష్పార్చన, 8న సహస్ర కలువ పుష్పార్చన, 9న సామూహిక అక్షరాభ్యాసాలు, సాయంత్రం పిల్లలచే సామూహిక సరస్వతీ పూజ, సహస్ర శ్వేత కుసుమార్చన, 10న సహస్ర గులాబీ అర్చన, సాయంత్రం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించనున్నారు. 11న సహస్ర వివిధ ఫలార్చన చేయనున్నారు. తొమ్మిది రోజుల పాటు ముగ్గురు అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని ఆయన ప్రధాన అర్చకుడు ఫణిశర్మ కోరారు.

క్లుప్తంగా

అన్నదానానికి రూ.25 వేల విరాళం



విరాళం చెక్కు అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అన్నదానానికి దాతలు విరాళం అందజేశారు. ఆదివారం దివ్యక్షేత్రంలో ట్రస్ట్ ప్రతినిధుల సమక్షంలో ఎస్టీబీఎల్ సీతారామ గార్డెన్స్‌కు చెందిన టి.గన్విత క్రితి, తండ్రి టి.చైతన్యకుమార్ రూ.25 వేల చెక్కు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం



శ్రీదేవి భూదేవి సహిత శ్రీనివాసుడు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రలో శ్రీవారి శాంతి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా దివ్యక్షేత్రంలో శాంతి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శిలువ విజయోత్సవం



శిలువ విజయ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్

గాజువాక: పాతగాజువాకలోని హోలీక్రాస్ కేథలిక్ చర్చిలో శిలువ విజయోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని సంఘం సభ్యులకు శిలువ విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఫాదర్ శౌరి బాబు మాట్లాడుతూ శిలువ అంటే ప్రేమకు చిహ్నమని, పరిశుద్ధ శిలువను చూడగానే దేవునికి మనపట్ల ఉన్న ప్రేమ గుర్తుకు వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు జోసెఫ్, రవీంద్ర, జేసుదాస్, ఆర్జీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



శాకాహార సద్భావన ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ సొసైటీ సభ్యులు

గాజువాక: పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్టు అనుబంధ సంస్థ పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని శ్రీనగర్ దరి దుర్గానగర్ జంక్షన్‌వద్ద పల్లా కార్తీక్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పల్లా కార్తీక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాకాహారంతో ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అనంతరం పిరమిడ్ సంస్థ సభ్యులు శాకాహారం ప్రయోజనాలపై దుర్గానగర్ పరిసర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్టు ప్రతినిధులు బి.అప్పారావు, ఎం.శివగణేశ్వరరావు, టి.రేవతీదేవి, పద్మావతి, బాలాజీ, కనకారావు, అప్పలనర్సమ్మ, సత్యనారాయణ, సుబుద్ధి, అప్పలరాజు, దేవిక, వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్



పోలీసులకు చిక్కిన నిందితులు

అక్కిరెడ్డిపాలెం: సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న కంచరపాలెం ప్రాంతానికి చెందిన ముగ్గురిని గాజువాక క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన కర్రి చంటిబాబు గాజువాక మార్కెట్‌లో డీజే ఈవెంట్స్ లైటింగ్ అండ్ డెకరేషన్స్‌లో పనిచేయడానికి కుదిరాడు. అయితే అతని రూ.5 వేల విలువగల ఫోను శనివారం రాత్రి పడుకున్న సమయంలో చోరీకి గురైంది. మండపంలోనే పడుకున్న చంటిబాబు సోదరుడు శివ కూడా సెల్ ఫోను పోయిందని తెలిపాడు. వెంటనే చంటిబాబు గాజువాక క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఇటు వంటి దొంగతనాలపై గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో పలు ఫిర్యాదులు రావడంతో నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలమేరకు జాయింట్ కమిషనర్ సూచనల మేరకు క్రైం డీసీపీ కె.లతా మాధురి పర్యవేక్షణలో జోన్- 2 క్రైం ఏసీపీ ఇన్‌చార్జి వెంకటరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐ మన్మథరావుతో కూడిన స్పెషల్ క్రైం టీమ్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ముద్దాయిల పూర్తి సమాచారం సేకరించి ఆదివారం గాజువాక శ్రీకన్య థియేటర్ వద్ద కంచరపాలెం ప్రాంతానికి చెందిన నీలాపు అనోకు, కర్రి హేమవర్ధన్, వెతుందురి యోగిలను అరెస్ట్ చేశారు. వారి నుంచి నాలుగు మొబైల్స్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసై ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిపై గాజువాక, మల్కాపురం, పరవాడ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి.

ఎమ్మెల్యేకు అభినందన

అక్కిరెడ్డిపాలెం: లంకెలపాలెం దరి సాలాపువానిపాలెంలోని బీహెచ్‌పీవీ – హెచ్‌బీఎస్ 3వ ఫేజ్ 2000–2001 సంవత్సరాల్లో సొసైటీ ద్వారా వేసిన లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు లభించాయి. దీంతో ఆదివారం బీహెచ్‌పీవీ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ పాలకవర్గం ప్రతినిధులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలిపారు. ప్రతినిధులు మాట్లాడుతూ సుమారు 24 ఏళ్ల నుంచి అనుమతులకు సహకరించాలని అనేక ప్రయత్నాలు చేశామన్నారు. ఎట్టకేలకు అనుమతులు లభించాయని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు హౌస్ బిల్డింగ్ సొసైటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

గాజువాక : రోటరీ క్లబ్ సభ్యులు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని ఆ సంస్థ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. గాజువాక సమత, విశాఖపట్నం సౌత్, గాజువాక స్టీల్‌సిటీ రోటరీ క్లబ్‌ల సభ్యులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోటరీ ఆధ్వర్యంలో గాజువాకలో ఒక శాంతి చిహ్నం ఏర్పాటు చేయడానికి, శ్మశాన వాటికల ఆధునీకరణకు కృషి చేయాలని కోరారు. ప్రపంచంలో పోలియో నిర్మూలనకు రోటరీ కృషి మరువలేనిదన్నారు. అయినప్పటికీ ఇంకా 0.01 శాతం కేసులు అక్కడక్కడా కనిపిస్తున్నాయని, దాన్ని కూడా అరికట్టడానికి రోటరీ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ మురళీకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్, ప్రతినిధులు వెంకటగిరి, తిరుపతిరావు, మహేశ్వరరెడ్డి, రామునాయుడు, వెంకన్న చౌదరి, విక్టర్ రాజు, లక్ష్మణరావు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఆరోగ్యానికి మంచిది



రక్తదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అగనంపూడి: తరచూ రక్తదానం చేయడం వల్ల మరింత ఆరోగ్యంగా ఉండడంతో పాటు ఉత్సాహంగా ఉంటారని లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ సయ్యద్ అన్నారు. 79వ వార్డు అగనంపూడి ఉక్కు జనరల్ ఆస్పత్రిలో ముత్యాల హారం ఫౌండేషన్, లయన్స్‌క్లబ్ అగనంపూడి, లయన్స్ బ్లడ్ బ్యాంక్‌లు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధి బత్తుల కాళిదాసు ఉచిత రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆపన్నహస్తం అందిస్తున్నారన్నారు. 45 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కిడిమి హనుమంతురావు, బలిరెడ్డి సత్యనారాయణ, గుదే సుశీలా గజేంద్రరావు, ఎం.మస్తాన్‌రెడ్డి, ఆశారాజ్, బొండా ఈశ్వరరావు, జి.బోసుబాబు, నాయుడు, పిల్లి చంద్రరావు పాల్గొన్నారు.

రక్తదానంలో భాగస్వాములు కావాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ఉక్కునగరం: రక్తదానంలోయువత భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. కొల్లి అభిషేక్ జ్ఞాపకార్థం ఉక్కునగరం యూత్ రేజేటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్న వారికి ప్రాణ దానం చేసినట్టు అవుతుందన్నారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో రక్తం అందక పోవడం వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ప్రసాదుల శ్రీనివాస్, వందేమాతరం బ్లడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 35 యూనిట్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కోగంటి దీప్తి, రామ్మోహన్‌కుమార్, నమ్మి సింహాద్రి, వసంత్, రవి పాల్గొన్నారు.

దీపారాధనలు.. అన్నసమారాధనలు



కణితికాలనీలో అన్న సంతర్పణను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సాయి బాలాజీనగర్‌లో దీపాలంకరణ ఉత్సవం



అన్న సమారాధనను ప్రారంభిస్తున్న పల్లా చినతల్లి



భక్తులకు అన్నప్రసాదాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ శ్రీను

అగనంపూడి: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు మండపాల్లో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. భారీ అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. 87వ వార్డు కణితి నిర్వాసితకాలనీలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొద్ద గోవింద్, ప్రగడ వేణుబాబు, బొద్ద సన్యాసిరావు, ప్రగడ శ్రీను, శంకరరావు, గోవిందరాజులు, బుల్లెట్ రమణ పాల్గొన్నారు.

- వడ్లపూడి నిర్వాసిత కాలనీలు ఎన్టీఆర్ కాలనీ, తెలుకల వీధి, పాత వడ్లపూడి, గవర వీధి, తిరుమలనగర్, పద్మశాలి వీధి, తారకరామా కాలనీల్లో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు రమాదేవి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో దుగ్గపు దానప్పలు, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, బొండా గోవిందరాజులు, చిత్రాడ రమణ పాల్గొన్నారు.
- 86వ వార్డు సాయి బాలాజీనగర్‌లో గణపతి, సరస్వతీ పూజలు, కుంకుమ పూజలు ఘనంగా జరిపించారు. విశేషంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, కాలనీ అసోసియేషన్‌ప్రతినిధులు పి.వీరభద్రరావు, పి.ఎస్.ఎన్.రాజు, బి.ఎ.స్వామి పాల్గొన్నారు.
- 85వ వార్డు సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, బి.సత్యనారాయణ, సీహెచ్. నాగరాజు పాల్గొన్నారు.

హైస్కూల్ రోడ్‌లో ..

గాజువాక: జీవీఎంసీ 67వ వార్డులో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాజువాక హైస్కూల్ రోడ్‌లో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్ పర్సన్ పల్లా చినతల్లి ప్రారంభించారు. సుమారు మూడు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పల్లా పెంటారావు, యువజన సంఘం నాయకులు సబ్బవరపు ప్రశాంత్, రొంగలి ప్రకాష్, డి.అప్పారావు, సింగంపల్లి శంకర్, డి.వాసు తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాతా బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమారాధనను కార్పొరేటర్ గంధం శ్రీను ప్రారంభించారు. సుమారు 5 వేల మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు చెల్లి రుషికేష్, గాలి అన్వేష్, జీఎస్ నాయుడు, అప్పారావు, ఎల్‌ఐసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పందుల బెడద



చినకోరాడలో చెత్తను చిందర చేస్తున్న పందులు

పెదగంట్యాడ: మండలంలో మళ్లీ పందుల బెడద ఎక్కువైంది. జనావాసాల మధ్య గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. రోడ్లపై విచ్చలవిడిగా సంచరించడంతో వాహనచోదకులు వాటిని ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. సంజీవి కాలనీ, కోరాడ, హౌసింగ్ బోర్డు కాలనీ, రామచంద్రనగర్, డెయిరీ కాలనీ, నడుపూరు తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండిపోవడంతో అందులోనే సేద దీరుతున్నాయి. రోడ్ల పక్కన ఉన్న చెత్తలోనే తిష్టవేసి ఆ చెత్తాచెదారాన్ని చిందర వందర చేస్తున్నాయి. నిత్యం ఈ ప్రాంతంలోని స్టీల్ ప్లాంట్, గంగవరం పోర్టు ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో పందులు అక్కడే సంచరిస్తూ వాహనాలకు అడ్డుపడుతున్నాయి. అధికారులు స్పందించి పందుల నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

రౌడీ షీటర్లకు పోలీసుల హెచ్చరిక

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనంలో ఎటువంటి అల్లర్లు చేసిన కఠినమైన చర్యలు తీసుకుంటానని ద్వారకా సీఐ డి.వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో 18 గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒకొక్క గణపతి నిమజ్జనం వద్ద ఒక కానిస్టేబుల్ పర్యవేక్షిస్తారన్నారు. మద్యం సేవించి అల్లరు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసభ్యకర నృత్యలు చేస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. నిమజ్జనం నిర్వహించే రోజు రౌడీషీటర్లను అదుపులో తీసుకుంటామన్నారు.

సమాజాభివృద్ధిలో ఇంజినీర్లు కీలకం

రాష్ట్ర కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్

మురళీనగర్: సమాజాభివృద్ధిలో ఇంజినీరు కీలక పాత్ర వహిస్తాడని రాష్ట్ర కాలేజీ విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ఇంజినీర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి, పరిపాలన, ప్రణాళికా రచనలో ఇంజినీర్లు ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అంతర్జాతీయంగా పేరు పొందిన ఇంజినీరని ఆయన వారసులుగా ఇంజినీర్లు అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు పాత్రను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ గ్యాడ్యుయేట్స్ సివిల్ సర్వెంటుగా ఉంటే ఎంత ఉపయోగమో తను అనుభవపూర్వకంగా తెలుసుకున్నానన్నారు. తాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు వెలుగొండ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేశానన్నారు. మైనర్, మేజర్ ఇరిగేషన్‌ను ఇంటిగ్రేట్ చేసి అమలు చేస్తే మంచి ఉపయోగం ఉంటుందని తన నివేదికలో సూచించినట్లు చెప్పారు. కాబోయే ఇంజినీర్లు మంచి భవిష్యత్‌ను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహాన్ని కాలేజీ పూర్వ విద్యార్థులు ఎ.వరహాలు, ఎంఎస్‌డీ కుమార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, ఐఎస్‌టీడీ విశాఖ జిల్లా చాప్టర్ గౌరవ కార్యదర్శి డాక్టర్ కొండల ముఖేష్, పూర్వ విద్యార్థులు వి.రామచంద్రరావు, వి.నాగభూషణరావు, బాలకృష్ణ, సత్యనారాయణ, పాల్గొన్నారు.